
కిలో ఎండు కొబ్బరి రూ.200



పాలసముద్రం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా కొబ్బరి ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండు కొబ్బరి కిలో రూ.200 నుంచి రూ.240 వరకు పలుకుతోంది. గత ఏడాది ఎండు కొబ్బరి కిలో రూ.100 వరకు మాత్రమే పలికింది. పాలసముద్రం మండలంలో సుమారు 3,000 ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతోంది. ప్రస్తుతం వంద పచ్చి కొబ్బరికాయలు రూ.2000 నుంచి రూ.2,200 వరకు పలుకుతున్నాయి. కొబ్బరి తోటలకు ఏరిఫైడ్ నల్లి సోకడంతో దిగుబడి తగ్గి పోయింది. కేరళ, తమిళనాడులో అయితే ఏరిఫైడ్‌తోపాటు నల్లిరోగం సోకడం వల్ల దిగుబడి తగ్గి పోయిందని రైతులు చెబుతున్నారు. దిగుబడి తగ్గినా ధర పెరగడం వల్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండుకు తగినట్లు ఉత్పత్తి లేకపోవడం వల్ల వ్యాపారులే రైతుల వద్దకొచ్చి కొబ్బరి కాయలు, ఎండు కొబ్బరిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

ఐరాల(కాణిపాకం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. శనివారం సెలవు రోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు స్వామి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయి ఆలయం వెలుపలకు వ్యాపించాయి. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించేలా సిబ్బందితో కలిసి ఈవో పెంచలకిషోర్ క్యూలైన్లను పర్యవేక్షించారు.

చాట్‌బాట్‌తో 250 ఫోన్ల స్వాధీనం



బాధితులకు ఫోన్లను అందజేసిన ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బాధితులు పోగొట్టుకున్న, చోరీలకు గురైన 50 లక్షల విలువైన 250 ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ మణికంఠ స్థానిక పోలీసు అతిథి గృహంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం మీడియాకు తెలిపారు. మొబైల్ ఫోన్ పోయినవారు ఇంట్లో నుంచే చాట్‌బాట్ ద్వారా పోలీసులకు సమాచారం ఇస్తే చాలు. చాట్‌బాట్ బృందం మొబైల్ ట్రాకింగ్ ద్వారా రికవరీ చేస్తుంది. మన రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర నుంచి కూడా రికవరీ చేశారని ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు 11 దశల్లో 7.92కోట్ల విలువైన 3791 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు చెప్పారు. సమావేశంలో క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు, ఒకటో పట్టణ సీఐ మహేశ్వర, చాట్‌బాట్ సిబ్బంది బాషూజీ, రఘురామన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాధితులకు ఫోన్లను ఎస్పీ అందజేశారు. టెక్నికల్ టీమ్‌కు రివార్డులను ప్రదానం చేశారు.

చాట్‌బాట్‌కు సమాచారం ఇవ్వాలిలా..

మొబైల్ పోగొట్టుకున్నవారు ముందుగా 94409 00004 వాట్సాప్ నెంబరుకు హాయ్ లేదా హెల్ప్ అని పంపాలి. ఆ వెంటనే వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీసు అనే పేరున ఒక లింకు వస్తుంది. ఆ లింకులో గూగుల్ పోర్టల్ ఓపెన్ అవుతుంది. అందులో సూచించిన విధంగా జిల్లా పేరు, వయస్సు, తండ్రి చిరునామా, కాంటాక్టు నెంబరు, మిస్సయిన మొబైల్ మోడల్, ఐఎంఈఐ నెంబరు, పోగొట్టుకున్న ప్రదేశం తదితర వివరాలను పొందుపరిచి, సబ్మిట్ చేస్తే చాలు. పోలీసులు ఆ మొబైల్‌ను రికవరీ చేసి బాధితులకు అందిస్తారని ఎస్పీ మణికంఠ వివరించారు.

జగన్ రెడ్డికి తీర్థయాత్రలే గతి

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ధ్వజం

గంగాధరనెల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'జగన్ రెడ్డీ నువ్వేమో దండయాత్రలు చేస్తావు .. నీ చెంచాగాళ్లతో పాత్రికేయ మిత్రులపై దాడులు చేయిస్తావు .. ఇకనైనా రైతుల విషయంలో రాద్ధాంతం ఆపకపోతే ఆఖరికి తీర్థయాత్రలకే పోతావు' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు.విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు,ప్రభుత్వ విప్ వీఎం థామస్‌లతో కలసి శనివారం గంగాధరనెల్లూరు మండలంలో ఆయన పర్యటించారు.గంగాధరనెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన రూ.61లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి భూమి పూజ చేశారు. నెల్లేపల్లెమిట్టలో రూ.25లక్షలు, చిన్నమిట్టపల్లెలో రూ.15లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.నెల్లేపల్లె దళితవాడలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.అనంతరం మీడియా సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మూడురోజుల క్రితం మాజీ సీఎం జగన్‌రెడ్డి బంగారుపాళ్యం పర్యటనకు వచ్చి మామిడిపంటను రోడ్డుపాలు చేసి ట్రాక్టర్లతో తొక్కించి నాశనం చేశారంటూ ధ్వజమెత్తారు.మామిడి రైతులనుంచి 80శాతానికి పైగా పంటను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేయించిన తర్వాత ఆయన రాద్ధాంతం చేసేందుకు వచ్చారేగాని రైతాంగానికి ఒరిగిందేమీ లేదన్నారు.దిగుబడి ఎక్కువ రావడంతో తోతాపురి ధరలు పతనమయ్యాయని తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు టన్నుకు రూ.4వేల లెక్కన ప్రభుత్వ సహాయాన్ని ప్రకటించారని గుర్తు చేశారు.వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని ఢిల్లీలో పెట్టి కేంద్ర ప్రభుత్వంతో రూ.250కోట్లు నిధులు తెప్పించుకున్న ఘనత చంద్రబాబుదన్నారు.



నెల్లేపల్లె దళితవాడలో టీడీపీ కరపత్రాలను పంపిణీచేస్తున్న రాంప్రసాద్‌రెడ్డి, రవికుమార్,ప్రసాదరావు, థామస్

మంత్రి రవికుమార్ మాట్లాడుతూ థామస్ తనను క్రితం కలిసి బాలగంగనపల్లె, గాదంకి, కామచేనుపల్లెల్లో 33-11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటుచేయాలని కోరారన్నారు. త్వరలోనే ఈ సబ్‌స్టేషన్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

పెరిగిన మామిడి ధరలు



బంగారుపాళ్యం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మామిడి సీజన్ ముగింపునకు వస్తుండడంతో ధరలు పెరుగుతున్నాయి. శనివారం ర్యాంపులు,మండీల వద్ద గుజ్జు పరిశ్రమలకు తరలించే తోతాపురి రకం టన్ను రూ.7 వేలు పలికింది. వారం క్రితం ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో కాయలను రైతులు కోయలేదు.ఇప్పుడు ధరలు పెరగడంతో కోసి మండీలకు, ర్యాంపులకు కాయలను తీసుకొస్తున్నారు. శనివారం జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన రెడ్డి, ఏడీ కోటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ బంగారుపాళ్యం మండలంలోని ర్యాంపులను,మండీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన రెడ్డి మాట్లాడుతూ ర్యాంపులకు,మండీలకు తోతాపురి రకం తరలించే రైతులు తప్పని సరిగా పట్టాదారుపాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు బుక్ అధికారులకు అందజేస్తే ప్రభుత్వం రూ.4 రూపాయల సబ్సిడీ వారి ఖాతాలకు జమ చేస్తుందని తెలిపారు. ఈ నెల చివరి వరకు కాయలను కొనుగోలు చేస్తామని,మామిడి ధరలు పెరిగే అవకాశాలున్నందున రైతులు అదును చూసి కాయలు కోసుకోవాలని సూచించారు.శనివారం మార్కెట్‌కు టేబుల్ రకాల మామిడి కవర్ బేనీషా టన్ను రూ. 60 వేల నుంచి 70 వేలు, కవరు కట్టని బేనీషా టన్ను రూ. 20 వేల నుంచి రూ.45 వేలు , కవర్ కట్టిన తోతాపురి రకం టన్ను రూ. 22వేలు, కవరు కట్టని తోతాపురి టన్ను రూ. 9వేల నుంచి 11 వేలు ధర పలకగా నీలం టన్ను రూ.7 వేల నుంచి రూ.26 వేల వరకు పలికింది.

శ్రీకాళహస్తిలో కలకలం

● హత్యకు కారణాలపై పలు అనుమానాలు

● పార్టీ నుంచీ బహిష్కరించిన జనసేన అధిష్టానం

మాజీ పీఏ హత్య కేసులో జనసేన ఇన్‌చార్జి వినుత దంపతులు సహా ఐదుగురి అరెస్టు



శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)



శ్రీనివాస్ మృతదేహంపై వాతలు

శ్రీకాళహస్తి/తిరుపతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):మాజీ పీఏ హత్య కేసులో శ్రీకాళహస్తి జనసేన ఇంఛార్జి వినుత దంపతులను చెన్నై పోలీసులు అరెస్టు చేయడం రాజకీయవర్గాల్లో కలకలం రేపింది.అసలేం జరిగిందో తెలియక పార్టీ వర్గాలతో పాటు ప్రజానీకం కూడా అయోమయానికి లోనైంది.రేణిగుంట పట్టణానికి చెందిన వినుతను 2019లో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రకటించారు. బంగారుపాళ్యానికి చెందిన కోట చంద్రబాబుతో అదే సంవత్సరంలో ఆమెకు వివాహం జరిగింది. ఆ సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన తరపున పోటీ చేసి ఓడిపోయారు. శ్రీకాళహస్తి పట్టణంలో వినుత దంపతులు అద్దె ఇంట్లో నివాసం, పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగించేవారు.

ఎవరీ శ్రీనివాసులు?

ఆరేళ్ళుగా వినుత వద్ద డ్రైవరుగా, వ్యక్తిగత సహాయకుడిగా శ్రీకాళహస్తి మండలం బొక్కిసపాలెం గ్రామానికి చెందిన రాజేశ్వరమ్మ మనవడు శ్రీనివాసులు అలియాస్ రాయుడు పని చేసేవాడు.వారితో అత్యంత సన్నిహితంగా మెలిగేవాడు.ఈ క్రమంలో గత నెల 22వ తేదీన శ్రీనివాసులును పనిలో నుంచి తొలగిస్తున్నట్లు వినుత దంపతులు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ రాజకీయ ప్రత్యర్థుల ప్రలోభాలకు లొంగిన శ్రీనివాసులు ప్రాణ, గౌరవ అంశాలలో భంగం కలిగిస్తున్నాడన్న కారణంతో తొలగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.వినుతకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఇతర సమాచారం రాజకీయ ప్రత్యర్థులకు శ్రీనివాసులు అందజేస్తున్నాడనే అనుమానాలు రావడంతోనే అతడిని పీఏగా తొలగించినట్టు ప్రచారం జరుగుతోంది.అనంతరం వినుత, ఆమె కుటుంబీకులు, అనుచరులు పలుమార్లు శ్రీనివాసులును నిర్బంధించి చిత్రహింసలకు గురి చేసినట్టు ఆరోపణలున్నాయి. తమ సమాచారం ఎవరు అడిగారు? ఏ సమాచారం అందజేశావు? వంటి వివరాలు రాబట్టేందుకు హింసించారని, తాము హింసించిన దృశ్యాలను వీడియో తీయడంతో ఆ సందర్భంగా శ్రీనివాసులు చెప్పిన విషయాలను కూడా వీడియో రికార్డింగ్ చేశారని సమాచారం. గత నెలలో ఒకసారి, మళ్ళీ ఈనెల ప్రారంభంలో ఒకసారి రేణిగుంట గోదాములో నిర్బంధించి చిత్రహింసలు పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

హత్యకు దారితీసిన కారణాలేంటి?

గత ఎన్నికలకు ముందు నుంచీ కూడా వినుతకు జనసేనలోనే ఇతర నేతలతో సత్సంబంధాలు, సామరస్యం లేదని సమాచారం. కూటమిలోని మరో ప్రధాన పార్టీ ముఖ్యనేతతో సైతం సత్సంబంధాలు లేవని, కొంతమేరకు విభేదాలు కూడా వున్నాయనే ప్రచారం జరిగింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో ప్రాధాన్యత బాగా తగ్గిపోయింది. ఆ క్రమంలో నియోజకవర్గ ముఖ్యనేతపై వినుత మంత్రులకు ఫిర్యాదులు చేశారన్న ప్రచారం జరిగింది. వీటన్నింటి నేపథ్యంలో వినుత సన్నిహిత అనుచరులు క్రమేపీ ఆమెకు దూరమైనట్టు సమాచారం. దాని వెనుక తన రాజకీయ ప్రత్యర్థులున్నారని,వారి ప్రలోభాలతోనే తన అనుచరులు దూరమవుతున్నారని వినుత సన్నిహిత వర్గాలు అసంతృప్తితో వున్నట్టు తెలిసింది. అదే సమయంలో పీఏ శ్రీనివాసులు ఆమెకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఇతర సమాచారం రాజకీయ ప్రత్యర్థులకు అందజేస్తున్నాడనే అనుమానాలు రావడంతోనే అతడిని కొట్టి వేధించారని సమాచారం.



రేణిగుంటలో హతమార్చి...చెన్నైలో పడవేసి...

ఈనెల 7వ తేదీన శ్రీనివాసులును రేణిగుంట గోదాముకు తీసుకెళ్ళి తీవ్రంగా కొట్టారని, ఆ సందర్భంగా కూడా వీడియోలు తీశారని, అతడు చెప్పిన సంగతులు కూడా రికార్డు చేశారని సమాచారం. బాత్‌రూమ్‌కు వెళ్ళిన శ్రీనివాసులు అందులోనే చనిపోయాడని, దాంతో వారు శ్రీనివాసులు మృతదేహాన్ని తీసుకుని రెండు కార్లలో తమిళనాడు వైపు వెళ్ళినట్టు సమాచారం. తిరువళ్ళూరు చేరుకున్నాక ఏపీ రిజిస్ట్రేషన్‌తో వున్న కారు నుంచీ మృతదేహాన్ని తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన కారులోకి మార్చి చెన్నై వెళ్ళినట్టు తెలిసింది. చెన్నై చేరుకున్నాక అదే రోజు రాత్రి సెవెన్ వెల్స్ ప్రాంతంలోని ఎంఎస్ నగర్ హౌసింగ్ కాలనీ వెనుక కువ్వా నది కాలువలో పడవేసినట్టు చెన్నై పోలీసుల దర్యాప్తులో తేలింది.

చెన్నై పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ

ఈనెల 8వ తేదీన కువ్వా నది కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించడంతో మింట్ పోలీస్ స్టేషన్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వారు శవాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.పోస్టుమార్టం నివేదిక ఆ యువకుడిది హత్యేనని తేల్చి చెప్పింది.శరీరంలోపలి భాగంలో పలుచోట్ల గాయాలైనట్లు స్పష్టం చేసింది.దీంతో పోలీసులు మృతదేహం లభించిన కాలువలో మళ్లీ పడవల సాయంతో గాలించారు. ఆ సమయంలో పోలీసులకు ఓ సంచీ, మొబైల్ ఫోన్ లభ్యమయ్యాయి. ఆ సంచీలో దొరికిన ఆధారాలను బట్టి తిరుపతికి చెందిన శ్రీనివాసులుగా గుర్తించిన పోలీసులు.. మొబైల్ ఫోన్ కాల్‌డేటాను పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై జనసేన పార్టీ చిహ్నం, వినుతక్క అనే టాటూ వుండడంతో చెన్నై పోలీసులకు క్లూ దొరికింది.ఆపై రంగంలోకి దిగి మృతదేహాన్ని కాలువలో పడేసిన దగ్గర నుంచీ సీసీ కెమెరాల ఫుటేజీలను రివర్సులో పరిశీలిస్తూ వెళ్ళగా తిరువల్లూరులో ఏపీ రిజిస్ట్రేషన్ వాహనాన్ని గుర్తించారు. అక్కడి నుంచీ రేణిగుంట గోదాము దాకా చేరుకున్నారు. గోదాములో సీసీ కెమెరాల ఫుటేజీలు కూడా చెన్నై పోలీసులు సేకరించినట్టు సమాచారం. ఆ ఆధారాలతో నిందితులను గుర్తించినట్టు తెలిసింది.

3 నెలలుగా టార్చర్

- శ్రీనివాసులు అమ్మమ్మ రాజేశ్వరి వేదన

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి):తన మనవడు శ్రీనివాసులును వినుత దంపతులు 3 నెలలుగా టార్చర్ పెట్టారని అతడి అమ్మమ్మ రాజేశ్వరి తెలిపారు. చెన్నై సెవెన్‌వెల్స్ పోలీసు స్టేషన్ వద్ద 'ఆంధ్రజ్యోతి'తో రాజేశ్వరి మాట్లాడుతూ.. "నెల రోజుల క్రితం కిందపడి 3 కుట్లు పడ్డాయని తెలిసి చూడ్డానికి వెళ్లా. అతనేమీ మాట్లాడలేదు. కానీ చంద్రబాబు మాత్రం 'మీ మనవడు మా సమాచారం వేరే పార్టీ వారికి ఇవ్వబోయి దొరికిపోయాడు. మా నుంచి తప్పించుకుని పారిపోతూ బిల్డింగ్ పైనుంచి కిందపడ్డాడు' అని చెప్పాడు. అడిగితే మా మనవడు ఏడుస్తూ వుండిపోయాడు. ఒక లాయర్‌ను తీసుకొచ్చి వీడియో తీస్తూ తెల్లకాగితంపై సంతకాలు తీసుకున్నారు. అందులో వారికిష్టమొచ్చింది రాసుకున్నారు. ఆ రోజు నేను కూడా వినుత మొగుడి కాళ్లు పట్టుకున్నా.. మావాణ్ని ఏమీ చేయవద్దని. అయినా మూడు నెలల నుంచీ ఓ గోడౌన్‌లో టార్చర్ చేస్తున్నారు. వారి వద్ద ఆరేళ్లుగా పని చేస్తున్న శ్రీనివాసులు పది రోజుల క్రితం పని మానేశాడు. కానీ మళ్లీ పిలుస్తున్నారని, నాలుగు రూపాయలు సంపాదించుకుని వస్తానని వెళ్లాడు. తనకు తెలిసిన విషయాలు బయటకు చెబితే వాళ్లు చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని అన్నాడు. 'జాగ్రత్త అమ్మమ్మా' అన్నాడు. ఇంతలోకే అతన్ని చంపేశారు. నిన్న సాయంత్రం 4 గంటలకు పోలీసులు వచ్చి చెబితే గానీ అతను చనిపోయిన విషయం మాకు తెలియలేదు."

వినుత సహా ఐదుగురి అరెస్టు



నిందితులు కోట వినుత , కోట చంద్రబాబు, గోపి, షేక్ తస్సాన్, శివకుమార్

శ్రీనివాసులు హత్య కేసులో జనసేన ఇంఛార్జి వినుత, ఆమె భర్త కోట చంద్రశేఖర్ (చంద్రబాబు),వారి వద్ద డ్రైవర్లుగా పనిచేసే రేణిగుంటకు చెందిన తస్సం(28), తొట్టంబేడు మండలం సింగమాలకు చెందిన గోపి(24), వారి ప్రధాన అనుచరుడుగా ఉన్న బొక్కిసంపాళెంకు చెందిన శివకుమార్(34)ను తమిళనాడు పోలీసులు అదుపులోకి తీసుకుని చెన్నైకు తరలించారు.వారి నుంచీ ల్యాప్‌టాప్ సహా శ్రీనివాసులును హింసించిన వీడియోలు, అతడు చెబుతుండగా రికార్డు చేసిన వీడియోలు కూడా స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.శనివారం రాత్రి నిందితులను చెన్నైలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.


జనసేన నుంచి బహిష్కరణ

జనసేన పార్టీ నుంచి వినుతను బహిష్కరిస్తున్నట్లు శనివారం ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న వినుత వ్యవహార శైలి పార్టీ విధానాలకు విరుద్ధంగా వుండడంతో కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఆమెపై చెన్నైలో హత్య కేసు నమోదు కావడం పార్టీ దృష్టికి రావడంతో వినుతను బహిష్కరిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రులుఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, బీసీసీఐ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అంకిత్ కలియార్, సినీ హీరో సంతోష్ శోభన్, నటుడు అశోక్ బాబు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.




ఆనం రామనారాయణరెడ్డి - కొల్లు రవీంద్ర - సంతోష్ శోభన్ - అశోక్‌బాబు

అతి త్వరలో వంద భాషల్లో శ్రీమద్ భగవద్గీత

● గాయకుడు గజల్ శ్రీనివాస్



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): శ్రీమద్ భగవద్గీతను అతి త్వరలో నూరు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా శ్రీమద్ భగవద్గీతను నూరు భాషల్లో చేయాలనే యజ్ఞంలో కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, సంస్కృతంలో తాను పాడిన భగవద్గీతను తిరుపతిలో విడుదల చేసి స్వామికి అంకితం చేస్తామన్నారు.

శ్రీహరి దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.84 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,217

తలనీలాలు సమర్పించినవారు: 31,155



గజరాజుల కట్టడికి యాక్షన్‌ప్లాన్

● దక్షిణాది రాష్ట్రాల సమాలోచనలు ● నోడల్ కమిటీకి నివేదిక అందజేసిన సబ్ కమిటీ



మంగళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులు పెద్దసమస్యగా మారింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు 18న తమిళనాడు మాజీ పీసీసీఎఫ్ సంజయ్ కె శ్రీనివాస్ చైర్మన్‌గా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తి స్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పరిశీలన

దక్షిణాది రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఏర్పడిన నోడల్ కమిటీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు ప్రవేశించే, అవి తిరిగి వెళ్లే మార్గాలను రెండు రోజుల క్రితం పరిశీలించింది. ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్న పలమనేరు, తలకోన, కల్లూరు, భీమవరం, బాలపల్లి, మామండూరు, తిరుమల నడక మార్గంలోని ఏడవ మైలును సందర్శించింది. శేషాచల కొండల్లోకి వస్తున్న ఏనుగులు సమీప భాకరాపేట, కల్లూరు, మామండూరు, బాలపల్లి, భీమవరం తదితర ప్రాంతాల్లో పంటలపై దాడి చేస్తున్న విషయాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. అనేక సందర్భాల్లో రైతుల ప్రాణాలను కూడా బలి తీసుకున్నట్లు ఆయా ప్రాంతాల వారు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోనూ ఈ కమిటీ పర్యటిస్తోంది. కేరళ నుంచి తమిళనాడు, కర్ణాటక మీదుగా ఆంధ్ర రాష్ట్రంలోకి ఏనుగుల మంద ఎప్పుడు వచ్చింది.. అందులో ఎన్ని ఏనుగులు ఉన్నాయి.. అవి ప్రయాణించే మార్గం, ఎక్కడెక్కడ ఎంతకాలం ఉంటున్నాయి.. ఆ సమయంలో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాల గురించి తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వీటిని నిలువరించడానికి గల అవకాశాలను పరిశీలిస్తారు. ఆదే సమయంలో అవసరమైన ఆహారం, నీరు పుష్కలంగా లభించే ప్రాంతాలను గుర్తిస్తారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా కసరత్తు చేస్తున్నారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయగలిగితే మేలు జరిగే అవకాశముంటుందని రైతులు భావిస్తున్నారు.

ఏనుగులు తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న నోడల్ కమిటీ సభ్యులు





ప్రీ-నేషనల్స్‌కు జిల్లా షూటర్స్ ఎంపిక



ప్రీ-నేషనల్స్‌కు ఎంపికైన జిల్లా షూటర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఎన్టీఆర్ కేవీకే 10మీటర్ల ఎయిర్ రైఫిల్/పిస్టల్ షూటింగ్ కేంద్రంలో శిక్షణ పొందిన పదిమంది షూటర్లు ప్రీ-నేషనల్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రేంజ్‌లో ఇటీవల హైదరాబాదు గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 11మంది ప్రాతినిథ్యం వహించారు. ఇందులో లవకుమార్, సాయిఅచ్యుత్‌రాయల్, హేమచంద్, పురుషోత్తం, భార్గవి, హస్విత, యోక్షిత, నందగోపాల్, హితేష్, వైష్ణవీలు నేషనల్స్‌కు ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కేవీకేలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.దేవరాజ్, డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను సన్మానించి, అభినందించారు. సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి డాక్టర్ భానుప్రకాష్, జయరాజ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



గ్రాప్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్యాలు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శనివారం సాయంత్రం 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఏపీ క్రీడా భారతి అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్, క్యాడెట్(బాలబాలికలు) విభాగాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అథ్లెట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రీడా భారతి కార్యదర్శి ధనంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్ర రెడ్డి, డీఎస్‌డీవో ఎన్.శశిధర్, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి పాల్గొన్నారు.

చంద్రగిరిలో మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్

● చిమ్మచీకట్లో ఆటోలో మద్యం తాగిన నలుగురి గుర్తింపు



యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండవాడ, బీడీ కాలనీ, జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్ కెమెరాతో నైట్ బీట్ నిర్వహించారు. తొండవాడ జాతీయ రహదారి సమీపంలోని చెట్ల పొదల్లో చీకట్లో ఓ ఆటోలో నలుగురు వ్యక్తులు మద్యం తాగుతున్న దృశ్యాలు ఇందులో రికార్డు అయ్యాయి. వెంటనే డ్రోన్ టీమ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి 8 గంటల తర్వాత పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు.

హిందూ ఆలయాల యువచైతన్య మహాపాదయాత్ర ప్రారంభం



ఎర్రావారిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) హిందూ దేవాలయాల యువచైతన్య మహాపాదయాత్రను శ్రీభువనగిరి పీఠాధిపతి కమలానంద భారతి ఆధ్వర్యంలో శనివారం తలకోన నుంచి ప్రారంభమైంది. 8నెలల పాటు సాగే పాదయాత్ర గురించి ఆయన మాట్లాడుతూ 'భగవద్భక్తి-కర్తవ్యదీక్ష-సమాజశక్తి' నినాదంతో తలకోన నుంచి సాధుసంపత్‌లు యాత్ర సంకల్పించారని చెప్పారు. సనాతన హైందవ ధర్మపరిరక్షణ, దేవాలయాలు, సంస్కృతాంధ్ర భాషా పరిరక్షణ, హిందూ యువ చైతన్యం లక్ష్యాలతో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, కర్నూలు, అనంతపురం, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నంద్యాల, కడప, నెల్లూరు జిల్లాల్లో 6 నెలల్లో 8 వేల గ్రామాల్లో పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఫిబ్రవరిలో తిరుపతిలో ధార్మిక మహాసమావేశంతో ముగియనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు హేమంబరధర నాయుడు, తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు, టీడీపీ మండల నాయకులు గోపి, కేశవుల నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

● సుదర్శన సహిత పారమాత్మిక హోమం



వేద విశ్వవిద్యాలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఉదయం సుదర్శన సహిత పారమాత్మిక హోమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు పాల్గొని మాట్లాడారు. టీటీడీ సహకారంతో రెండు దశాబ్దాలుగా వేద విజ్ఞాన వ్యాప్తిలో వేద యూనివర్సిటీ ఎంతో కృషి చేసిందన్నారు. ఎంతో మంది వేద పండితులను తీర్చిదిద్దిందని తెలిపారు. వేద విజ్ఞానంపై విలువైన పరిశోధనలు సాగాయన్నారు. అనేక విలువైన వేద సంబంధ గ్రంథాలు ప్రచురించినట్టు చెప్పారు. అనేక మంది వేద పండితులు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. వేద సంబంధ విషయాలపై సదస్సులు, వర్క్‌షాప్‌లు చేపట్టినట్టు వివరించారు. వేద, ఆగమ, పౌరోహిత్య, వేదాంగ, వేద భాష్యాలపై విస్తృత అధ్యయనం సాగుతున్నట్టు వివరించారు. శ్రీవారి అనుగ్రహం, టీటీడీ అధ్యక్షులు, ఈవోల సహకారంతో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. విద్యార్థులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం!

● హాజరుకాని బీజేపీ, టీడీపీ నాయకులు

వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం రేగింది. టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న వేద విశ్వవిద్యాలయం వార్షికోత్సవానికి టీటీడీ చైర్మన్‌ను, ఈవోను, యూనివర్సిటీ అధికారులను ఆహ్వానించలేదనే ఆరోపణలు వినిపించాయి. దీనికి కారణాలు ఏమిటనే విషయాన్ని పక్కనపెడితే స్థానిక బీజేపీ, టీడీపీ నేతలను మచ్చిక చేసుకోవడానికి వేద వర్సిటీ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారనే విమర్శ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో పలు అధికారిక హోదాల్లో ఉన్న స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులను వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికలోనూ వారి పేర్లను ముద్రించారు. అయితే తుదకు వారు కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇలాంటి పరిస్థితుల మధ్య వేద వర్సిటీ వార్షికోత్సవం సాగింది. ఈ వివాదం ఎక్కడికి దారితీస్తుందనేది ఆసక్తిగా మారింది.


జీవన మార్గాన్ని ఉపదేశించిన శ్రీమద్భగవద్గీత గజల్ గానం

● గజల్ గానంతో ఆహూతులను మంత్రముగ్ధులను చేసిన గజల్ శ్రీనివాస్



గజల్స్ గానం చేస్తున్న గజల్ శ్రీనివాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, నైతిక జీవన మార్గాన్ని ఉపదేశించేలా శ్రీమద్భగవద్గీత సారాన్ని ప్రఖ్యాత గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ తన స్వరంలో ఒలికించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో 'శ్రీమద్భగవద్గీత' గజల్ గానం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంతో సాంస్కృతిక వైభవం గల తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాన్ని మరింత సాంస్కృతిక శోభను తెస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుపతిలో జీవించడమే గొప్ప అదృష్టమన్నారు. పవిత్రమైన తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాలు మరింత మంచి వాతావరణాన్ని కలుగ చేస్తాయన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా తిరుపతి కేంద్రంగా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందన్నారు. ఈ క్రమంలో భగవద్గీతను గజల్ శ్రీనివాస్ నోట వినడం గొప్పగా ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్ ఆడియో పెన్‌డ్రైవ్‌ను ఆవిష్కరించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం అత్యద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్, ఉమా ముద్దుబాల, ఇతర అతిథులను అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గౌరవ కార్యదర్శి పాండ్ర సురేంద్ర నాయుడు సత్కరించారు. సభను ఆకెళ్ల విభీషణశర్మ సమన్వయం చేశారు. పలువురు కళాకారులు, కళాభిమానులు, నగర వాసులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకంలో ఉమా ముద్దుబాల బృందం

తిరుపతిలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

● పార్కింగ్ నిబంధనలపై ప్రైవేటు వాహనాల యజమానులకు సూచనలు

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలు, రిజర్వు బలగాలు, ఎస్టీఎఫ్ ఫోర్సుతో కలిసి నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. ప్రైవేటు బస్సులు రోడ్డుపై ఇష్టమొచ్చినట్లు పెట్టడంతో అసహనం వ్యక్తం చేశారు. పద్ధతిలో పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. అక్కడి నుంచి ట్రావెల్స్ ఆఫీసుల వద్దకు వెళ్లి మేనేజర్లను పిలిపించి బస్సులను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా పెట్టవద్దని సూచించారు. అక్కడే నడి రోడ్డుపై ఆపి ఉన్న ఆటోను పరిశీలించి ట్రాఫిక్ సీఐను పిలిచి జరిమానా వేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆటోలను పరిశీలించారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచారిని ఆదేశించారు. బస్టాండులో కొందరు ప్రయాణికులతో ముచ్చటించారు.

తిమ్మినాయుడుపాలెంలో సమస్యలపై ఆరా

తిమ్మినాయుడుపాళానికి వెళ్లిన ఎస్పీ స్థానికులతో ముచ్చటిస్తూ పోలీసు శాఖ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆకతాయిల ఆగడాలు, పోలీసులు రాత్రి గస్తీలపై అడిగి తెలుసుకున్నారు. డ్రోన్‌లతో మందుబాబులు, యువత, రౌడీలు, ఆకతాయిలు భయపడుతున్నారని, ఊరు ప్రశాంతంగా ఉందని స్థానికులు వివరించారు. అవిలాల, చంద్రగిరి, జీవకోన, ఎస్టీవీనగర్, మంగళం, తిరుచానూరు ప్రాంతాల్లో తనిఖీలు చేసి ప్రజలకు భరోసా కల్పించారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు.

విమానాశ్రయ ప్రైవేటీకరణను ఆపండి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



నిరసన తెలుపుతున్న చింతామోహన్

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటీకరణ చేయరాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. చింతామోహన్ మాట్లాడుతూ తిరుపతి విమానాశ్రయాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అంతర్జాతీయ స్థాయికి పునాది వేశారని గుర్తు చేశారు. రాయలసీమలో ఇది ఒకే ఒక అంతర్జాతీయ విమానాశ్రయమని తెలిపారు. దీన్ని అదానీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రావణ, వడివేలు, మురళి, సురేష్ ,శివ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపై బండి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), జూలై 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గురించి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తున్నామని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఒక ప్రకటనను శనివారం వీడియో ద్వారా విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమందికి పైగా అన్యమత ఉద్యోగులు ఉన్నారని బండి సంజయ్ చెప్పడం సరికాదని, వారిని తొలగించాలంటూ హెచ్చరించడాన్ని తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి ఆలయంపై దాడిలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. టీటీడీని ప్రక్షాళన చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం బండి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదని పేర్కొన్నారు.

తిరుమలలో సర్వే చేసి అన్యమతస్థులుంటే తొలగిద్దాం

● భూమనకు భానుప్రకాష్‌రెడ్డి సవాల్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో ఇంటింటి సర్వే చేద్దాం... ఎవరి ఇళ్లలోనైనా అన్య దేవుళ్ల సాహిత్యం, చిత్రపటాలు కనిపించినా ఆ ఉద్యోగులను టీటీడీ ఉద్యోగాల నుంచి తొలగిద్దాం... మీరు సహకరిస్తారా' అని మాజీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆ మేరకు ఆయన శనివారం ఓ వీడియో విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమంది అన్యమతస్తులు ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల మెనుక కుట్ర దాగి ఉందని భూమన పేర్కొనడాన్ని భానుప్రకాష్‌రెడ్డి ఖండించారు. '2019 నుంచి 2024 వరకు హిందూ వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలింది. ఓ నాస్తికుడు టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించారు. హిందూ ఆలయాలు, పవిత్ర రథాలపై దాడులు జరిగాయి. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా భారీ అవినీతికి పాల్పడ్డారు' అంటూ ధ్వజమెత్తారు. తిరుమలలో కొందరు పేరుకు రాముడు, కృష్ణుడుగా ఉన్నారు గాని వారి ఇళ్లలో మాత్రం ఏసు చిత్రపటాలు ఉంటున్నాయన్నారు. కరుణాకరరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇంటింటి సర్వేకు అంగీకరించి తమకు సహకరించాలని కోరారు.

క్రీడల్లో పతకాలు సాధించిన టీటీడీ వీఎస్వోలకు అభినందన



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలను సాధించిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం అభినందించారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలను చూపించారు. టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా విజయం సాధించినందుకు వారిని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.

కుట్రలు చేయడమే వైసీపీ నీచ సంస్కృతి: టీడీపీ



మీడియాతో సురేంద్రకుమార్

చిత్తూరు సెంట్రల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కుట్రలు చేయడమే వైసీపీ నీచ సంస్కృతి అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలిటికల్ టెర్రరిస్టుల్లా కొందరు వైసీపీ నాయకులు వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు. ప్రజల భద్రతకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుంటే.. వాటిని అంతం చేయడానికి వైసీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారన్నారు. మరోవైపు 'చెప్పి నరకడం కాదు, చెప్పకుండా నరికెయ్యాలి. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి' అంటూ మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు వైసీపీ నేతల మనస్తత్వానికి అద్దం పడుతున్నాయన్నారు. వీరి వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారని, మరోసారి బుద్ధి చెప్పడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు.

వరసిద్ధుడి సేవలో గ్రామీణ బ్యాంకు చైర్మన్



ప్రమోద్‌కుమార్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల (కాణిపాకం), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి శనివారం కాణిపాక వరసిద్ధుడిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, సీఎ్‌ఫవో నాగేశ్వరచౌదరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. వి.కోటలో 11.6, పెనుమూరులో 3.4, పాలసముద్రంలో 1.4, శ్రీరంగరాజపురం, గంగవరంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్లలోని బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో మిగిలిన ఖాళీల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ చదువుతున్న పాఠశాల స్టడీ సర్టిఫికెట్‌తో దరఖాస్తులను పూర్తి చేసి ఈనెల 18వ తేదీలోపు పాఠశాలలో సమర్పించి హాల్‌టిక్కెట్ పొందవచ్చన్నారు. ఈనెల 20వ తేదీన ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి కేసులో ముగ్గురి అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం, జూలై 12(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యంలో ఈ నెల 9న మాజీ సీఎం జగన్ మామిడి రైతుల ముఖాముఖి కార్యక్రమాన్ని కవర్ చేయడానికి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించడంపై అట్రాసిటీ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. చిత్తూరుకు చెందిన చక్రవర్తి, జీడీ నెల్లూరు మండలం ముక్కల్తూరుకు చెందిన వినోద్‌కుమార్, జీడీ నెల్లూరు దళితవాడకు చెందిన మోహన్‌లను అరెస్టు చేసి శనివారం రాత్రి చిత్తూరు సబ్‌జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పీఎం రోజ్‌గర్ మేళాలో రొంపిచెర్ల యువకుడికి అవకాశం




కిషన్‌రెడ్డి నుంచి అపాయింట్‌మెంట్ తీసుకుంటున్న రొంపిచెర్ల దీపక్‌రాజా

రొంపిచెర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సదరన్ రైల్వే వారిచే శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పీఎం రోజ్‌గర్ మేళాలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా రొంపిచెర్ల మండలం నగిరి గ్రామానికి చెందిన కోహినూరు రాజు, సుమతి దంపతుల పెద్ద కుమారుడు వళ్లిపాగు దీపక్‌రాజా ఎంపికయ్యాడు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిచే జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా నియామక పత్రాన్ని అందుకున్నాడు. 2023లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించిన పరీక్షలో విజేతగా నిలిచి ఎస్సీ కేటగిరిలో ఈ అవకాశం దక్కించుకున్నాడు. తమ కుమారుడి ఎంపికపై తల్లిదండ్రులతో పాటు స్నేహితులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

శ్రీకాళహస్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పూతలపట్టు-నాయుడుపేట రహదారి అండర్‌పాస్ వంతెనపై ముచ్చువోలు క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొండూరు గ్రామానికి చెందిన మనోజ్ కృష్ణ, అశోక్(20), అభి(21), పవన్(24), అజయ్(24) కారులో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు బయలుదేరారు. శ్రీకాళహస్తి శివారులోని ముచ్చువోలు క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొట్టారు. ఈ ఘటనలో మనోజ్ కృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.



యాదమరిలో శనివారం సాయంత్రం ఆకాశవీధిలో కనిపించిన అందాల హరివిల్లు

రామాపురంతాండాలో ఏనుగుల దాడులు



రామకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం అటవీ ప్రాంత పొలాలు, తోటలపై గజదాడుల పరంపర కొనసాగుతోంది. గురువారం రాత్రి చెలిమిచేను గ్రామ సమీప అడవిలో తిష్ట వేసిన ఆరు ఏనుగులు ఘీంకారాలు చేశాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు, ట్రాకర్లు అక్కడకు చేరుకుని వారు వాటిని అడవిలోకి మళ్లించారు. శుక్రవారం రాత్రి తిరిగి ఏనుగుల మంద అటవీ గ్రామ సమీపాల్లోకి వస్తాయన్న ముందు జాగ్రత్తతో సాయంత్రం నుంచే పలుచోట్ల నిఘా ఏర్పాటు చేశారు. ఏనుగుల మంద రామాపురంతాండా సమీపంలో ఉన్నాయన్న సమాచారంతో వారంతా అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అవి అటవీ సరిహద్దుల్లోని అరటి, టమోటా తోటల్లో తిరుగుతూ తిన్నంతగా తిని పలు చెట్లను ధ్వంసం చేశాయి. అధికారులు ట్రాకర్లు అతికష్టంపై వాటిని అడవిలోకి తరిమేశారు. మూడు రోజుల క్రితం 89పెద్దూరు అటవీ సమీప పొలాలు, తోటలపై దాడులు చేసిన ఏనుగుల మంద అలాగే ముందుకు సాగుతూ చెలిమిచేనుతాండా అడవుల్లోకి వెళ్లాయి. అదే బాటలో అవి తమిళనాడు వైపు వెళ్తాయని అటవీ అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అవి తిరిగి వెనక్కు మళ్లీ రావడంతో అటవీ ప్రాంత రైతులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి ఏనుగుల మందను నారాయణపురంతాండా, ననియాలతాండాల మధ్య అటవీ ప్రాంతంలోకి మళ్లించినట్లు అటవీ అధికారులు తెలిపారు. రెండు గ్రామాల వద్ద శనివారం రాత్రి ట్రాకర్లతో కలిసి తాము ఏనుగులు మంద కదలికను పసిగట్టి వాటిని తిరిగి అడవిలోకి పంపే ప్రయత్నం చేస్తామని తెలిపారు. పొలాల వైపు వస్తే రైతులెవరూ వాటిని రెచ్చగొట్టి తరిమే ప్రయత్నం చేయరాదని, వెంటనే తమకు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు.

చిక్కమంగళూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో స్టాపింగ్



కుప్పంలో రైలుకు పూజలు చేసి లోకో పైలెట్లను సత్కరిస్తున్న జగదీశ్‌బాబు, నేతలు

కుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ కొత్తగా ప్రవేశపెట్టిన చిక్కమంగళూరు- తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు రైల్వే అధికారులు కుప్పంలో స్టాపింగ్ సదుపాయం కల్పించారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు కుప్పంలో ఆగిన ఈ రైలుకు సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు, ఎన్డీయే నాయకులు, స్థానిక ప్రజలు పూజలు చేసి ప్రారంభించారు. లోకో పైలట్లను సత్కరించారు. ఈ రైలు ప్రతి గురువారం తిరుపతిలో రాత్రి 9 గంటలకు బయలుదేరి కుప్పానికి శుక్రవారం తెల్లవారుజామున 1.10 గంటలకు చేరుతుంది. ఇక్కడి నుంచి బయలుదేరి బెంగళూరు ఉదయం 3.05 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి చిక్కమంగళూరుకు ఉదయం 10 గంటలకు చేరుతుంది. అలాగే చిక్కమంగళూరులో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 12.30 గంటలకు కుప్పం చేరుతుంది. ఇక్కడి నుంచి బయలుదేరి తిరుపతికి ఉదయం 7.40 గంటలకు చేరుకుంటుంది. కర్ణాటక ప్రాంతంలోని చిక్కమంగళూరు సమీప ప్రాంతాలైన ధర్మస్థలతోపాటు ఇతర పుణ్యక్షేత్రాల సందర్శనకు కుప్పం ప్రజలకు ఈ రైలు ప్రయాణం వెసులుబాటు కల్పిస్తుంది. ఈ సందర్భంగా జగదీశ్‌బాబు, ఎన్డీయే నాయకులు మాట్లాడుతూ రైలు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ, రాష్ట్ర రైల్వే మంత్రి సోమన్న, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జగదీశ్‌బాబుతోపాటు టీడీపీ నాయకులు వీజీ.ప్రతాప్, సత్యేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేశ్, తులసీనాథ్, నరేశ్, జాకీర్, శ్యామసుందర్, చాంద్, మంజు, చంద్ర, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీఈఎస్‌లో తక్కువ ఖర్చుతో ఖరీదైన వైద్య సేవలు



న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మయూర్

కుప్పం, జూలై12(ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రిలో ఖరీదైన వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అతి తక్కువ ఖర్చుతో.. ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా ఉచితంగా అందిస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ముఖ్యంగా న్యూరో సర్జరీ విభాగంలో ఇటువంటి వైద్య సేవలు లభిస్తున్నాయని ఆ విభాగాధిపతి డాక్టర్ మయూర్ అన్నారు. ఇటీవల బెంగళూరు నుంచి వచ్చిన ఓ వ్యక్తికి మెదడు క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించి బాగుచేశామన్నారు. ముంబై నుంచి వచ్చిన జ్యోతికి అతి తక్కువ ఖర్చుతో వెన్నెముక ఆపరేషన్ చేశామని చెప్పారు. అలాగే 11 సంవత్సరాల చిన్నారి మేడపై నుంచి పడిపోవడంతో కోమాలోకి వెళ్లాడని.. శస్త్ర చికిత్స చేశామని.. ఆరోగ్యంగా ఉన్నాడని పేర్కొన్నారు. జయమ్మ అనే మరో మహిళ మెదడు మధ్యభాగంలో కణితి ఉండటంతో సూక్ష్మ మైక్రో పద్ధతిలో శస్త్ర చికిత్స చేసి టెప్లాన్ కోటింగ్ అమర్చినట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.10 లక్షలు ఖర్చయ్యే ఈ సర్జరీని పీఈఎస్‌లో కేవలం రూ.లక్ష ఖర్చుతో పూర్తి చేశామని చెప్పారు. పీఈఎస్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గజలక్ష్మీ నమోస్తుతే..!



తిరుచానూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి శనివారం రాత్రి గజవాహన సేవ నయనాందకరంగా సాగింది. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుగంధ పరిమళ ద్రవ్యాలతో పద్మావతిదేవికి నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. రాత్రి అలంకార శోభితురాలైన అమ్మవారు తనకు ప్రీతికరమైన గజవాహనంపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేళ, కర్పూర హారతులు సమర్పించారు.

కుటుంబ సలహాకేంద్రం.. మహిళల భద్రతకు చైతన్య వేదిక

ఎస్పీ మణికంఠ



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సలహా కేంద్రం.. మహిళల భద్రతకు చైతన్య వేదిక వంటిదని ఎస్పీ మణికంఠ చెప్పారు. కుటుంబ సలహా కేంద్రం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. ఈ కేంద్రం ద్వారా కుటుంబ సభ్యుల మధ్య పరస్పర నమ్మకాన్ని పెంపొందించడమే కాకుండా న్యాయమైన సమస్యలను పరిష్కారం చూపుతామన్నారు. ఏడాది కాలంలో 748 కుటుంబ సభ్యుల సమస్యలు వచ్చాయని, వాటిలో 482 కేసులను మానసిక నిపుణులు, చట్ట నిపుణులు, కౌన్సెలర్ల సహకారంతో పరిష్కరించామన్నారు. 181మందిపై గృహహింస చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. 58మందిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయగా 27 మంది కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉంటే మహిళలపై జరిగే హింసకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఒకటో పట్టణ సీఐ మహేశ్వర, మహిళా ఎస్‌ఐలు నాగసౌజన్య, కరీమున్నీషా తదితరులు పాల్గొన్నారు.

తాత ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే కర్తవ్యం

అంబేడ్కర్ మనవడు భీమ్‌రావ్ యశ్వంత్



సమావేశంలో ప్రసంగిస్తున్న భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్

నగరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తన తాత అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే కర్తవ్యమని ఆయన మనవడు ఆలిండియా బుద్ధిస్ట్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్ తెలిపారు. నగరి బస్టాండు ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. బుద్ధిస్ట్ సొసైటీ, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, సమతా సైనింగ్ వెల్ అండ్ గుడ్‌డే సొసైటీ ఆఫ్ ఇండియా ఆర్గనైజేషన్లు.. అంబేడ్కర్ పునాది వేసినవేనని చెప్పారు. వీటిని దేశవ్యాప్తంగా తీసుకెళతామన్నారు. నగరివాసులు చూపిన ఆదరణ మరువలేనిదన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తిరునావక్కరుసు, గజేంద్ర, పార్థసారథి, ధనంజయులు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ పరిష్కారం..... అంతంతమాత్రం

● రెండు నెలల్లో పరిష్కారమైంది 29 శాతం సమస్యలే



మే 5న నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో, జేసీ, ఎమ్మెల్యే తదితరులు

పలమనేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో మే 5వ తేదీన నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగి రెండు నెలలు గడిచిపోయినా ఇప్పటి వరకు కేవలం 29 శాతం సమస్యలు మాత్రమే పరిష్కరించారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ నుంచి జిల్లా కేంద్రంలో ప్రతివారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మిగిలిన అన్ని డివిజన్ల కంటే ఎక్కువ మంది ప్రజలు వచ్చి అర్జీలు ఇస్తున్నారని భావించి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పలమనేరులో మే 5న పీజీఆర్ఎస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ఆర్డీవో భవానితో పాటు జిల్లా లోని వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు. గంగవరం మండలం నుంచి సమస్యలపై 284 అర్జీలు రాగా.. ఇప్పటివరకు 114 సమస్యలు, పెద్దపంజాణి నుంచి 235 అర్జీలకు 118 సమస్యలు పరిష్కారం అయ్యాయి. అలాగే వి.కోట నుంచి 198 అర్జీలు రాగా .. 64 సమస్యలు, బైరెడ్డిపల్లి మండలం నుంచి 173 అర్జీలు రాగా.. 68 సమస్యలు, పలమనేరు రూరల్ నుంచి 157 అర్జీలకు గాను 38 సమస్యలు, బంగారుపాళ్యం మండలం నుంచి 138 అర్జీలకు 27, పుంగనూరు రూరల్ నుంచి 99 అర్జీలకు గాను 18, పలమనేరు అర్బన్ నుంచి 82 అర్జీలకు 53, సోమల మండలంలో 78 అర్జీలకు గాను.. 8 సమస్యలు, చౌడేపల్లి మండలంలో 74 అర్జీలకు గాను.. 12 సమస్యలు, సదుం మండలంలో 73 అర్జీలకు గాను 6 సమస్యలు, పుంగనూరు అర్బన్‌లో 23 అర్జీలకు గాను.. 3 సమస్యలు మాత్రమే పరిష్కారం అయ్యాయి. 10 మండలాలు, రెండు మున్సిపాలిటీలను పరిశీలిస్తే పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలో అత్యల్పంగా కేవలం 8 శాతం సమస్యలు పరిష్కరించబడగా... పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు అర్బన్‌లో అత్యధికంగా 63శాతం సమస్యలు పరిష్కరించబడ్డాయి. మండల స్థాయిలోని తహసీల్దార్లు కొందరు రాజకీయ అండతో సమస్యలకు పరిష్కారం చూపకుండా కాలయాపన చేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అర్జీదారులు కోరుతున్నారు.

సూళ్లూరుపేటలో భారీగా గంజాయి పట్టివేత

ఒడిశా నుంచి చెన్నైకి రవాణా - రూ.20 లక్షల విలువ చేసే గంజాయి ప్యాకెట్లు, కారు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు - వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, పక్కనే సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు

సూళ్లూరుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి చెన్నైకి తీసుకెళ్తున్న రూ.20 లక్షల విలువ చేసే 70.560 కిలోల గంజాయిని సూళ్లూరుపేట పోలీసులు శనివారం పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌లో శనివారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు, తడ ఎస్‌ఐ కొండపనాయుడు సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్తున్న ఏపీ 09 సీటీ 2966నంబరు కారును తనిఖీ చేశారు. వెనుక సీటు, డిక్కీలో నాలుగు బ్యాగ్‌లలో 70.560 కిలోల గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న తమిళనాడుకు చెందిన టీ.బిబిన్‌నాథ్, జే.రోహన్‌ను అదుపులోకి తీసుకుని కారుతో సహా పోలీసుస్టేషన్‌కు తరలించారు. విచారించగా ఒడిశాలో తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నైలో అధిక ధరలకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి, వారి వద్దనున్న రెండు సెల్‌ఫోన్లు, రూ.20 లక్షల విలువ చేసే గంజాయి, కారును సీజ్ చేశారు. నిందితులు తమిళనాడులో గంజాయి రవాణా, హత్య కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

కాలిఫోర్నియా బిజినెస్ స్కూలులో పుత్తూరు విద్యార్థికి ప్రవేశం



అఖిల్

పుత్తూరు, జూలై12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అఖిల్ నీలం ప్రఖ్యాత విద్యా సంస్థ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ ప్రవేశంతో పాటు ప్రతిభకు గుర్తింపుగా రూ.80 లక్షల స్కాలర్‌షిప్ పొందారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ బిజినెస్ స్కూల్‌లోనూ సీటు వచ్చినా కాలిఫోర్నియా స్కూల్‌నే ఎంపిక చేసుకున్నారు. ఢిల్లీ అశోక యూనివర్సిటీ, ఐస్‌ల్యాండ్‌లలో మాస్టర్స్ డిగ్రీలు చేశారు. తాను స్థాపించిన సెంటర్ ఫర్ జెండర్ అండ్ పాలిటిక్స్(సీజీపీ) అనే సంస్థ రాజకీయాల్లో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సాధికారతను సాధించడం వంటి అంశాల మీద పనిచేస్తుందని అఖిల్ తెలిపారు. ఈ విషయమై ఓ పుస్తకాన్ని రచించి ఐస్‌ల్యాండ్ అధ్యక్షురాలు హల్లా టోమాస్‌డోట్టిర్‌కు సమర్పించానని వివరించారు. ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలలో విద్యాశాఖకు సంబంధించి పాలసీ కన్సల్టెంట్‌గా ప్రత్యేకించి గత టీడీపీ ప్రభుత్వంలో ఆనంద వేదిక కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. తనకు ఇంతటి గుర్తింపు రావడం వెనుక తల్లిదండ్రులు విశ్రాంత ఉపాధ్యాయుడు నీలం ప్రభాకర్, అంజలి శ్రమ ఎంతో ఉందని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం



కుప్పంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో శనివారం లయన్స్ క్లబ్, పీఈఎస్ మెడికల్ కళాశాల సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఇందులో కంటి పరీక్షలు చేసి 27 మందిని ఉచిత కంటి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేశ్, కార్యదర్శి సెంథిల్ కుమార్, కోశాధికారి చరణ్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ప్రసాద్, డైరెక్టర్లు సెల్వం, డాక్టర్ కృష్ణమూర్తి, ఆజాద్ కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ గంగాధర్, పీఈఎస్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కురప్పల్లెలో తాగునీటి కష్టాలు



మామిడి తోటలో తాగునీరు పట్టుకుంటున్న చారాల కురప్పల్లె మహిళలు

చౌడేపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం గత రెండు వారాలుగా చారాల కురప్పల్లె గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని చారాల పంచాయతీలోని చారాల కురప్పల్లె గ్రామానికి తాగునీరు అందించే బోరులో నీరు తగ్గిపోవడంతో తాగునీరు సరఫరా కావడం లేదు. గత రెండు వారాలుగా గ్రామస్తులు తాగునీటి కోసం చుట్టుపక్క పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకొంటున్నారు. బోరుబావిలో పైపులు అదనంగా వేస్తే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని పలు మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులైన స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అబకలదొడ్డిలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం అబకలదొడ్డిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం జరిగిందని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు, మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అన్నా క్యాంటీన్లు తదితర పథకాల గురించి వివరించారు. కుప్పం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ముద్రించిన కరపత్రాలను అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలిఅడుగు' విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కుటుంబ సాధికార సారథుల పాత్ర ఎంతో కీలకమని, వారు పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామకుప్పం టీడీపీ మండలధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు కోరారు. శనివారం మండల పరిధి వీర్నమలలో నాలుగు బూత్‌లలోని కుటుంబ సాధికార సారథులు, పార్టీ ముఖ్యనేతలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఏడాది పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన పలు హామీలను నేరవేర్చడమే కాకుండా మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. సమావేశంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు భూపతి, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, మాజీ సర్పంచి జేయి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామకుప్పంలో గంగజాతర

రామకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని దిగువవీధి గంగమ్మ జాతర ఆదివారం నుంచి నిర్వహిస్తున్నటుల నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రైతు సంఘం, సోమవారం జ్యోతీనగరవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళవారం సజ్జల చెంగారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పచ్చిగెరిగె ఊరేగింపు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం అమ్మవారికి పొంగళ్ల సమర్పణ, దీపారాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపడుతామన్నారు. రాత్రి గంగమ్మ, పోతుల రాజు, సల్లాపురెమ్మ ఉత్సవర్లను ఊరేగిస్తామని తెలిపారు. గురువారం ఉదయం వసంతోత్సవంతో జాతర ముగుస్తుందని వివరించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : మంత్రి



కాజూరులో స్థానికుడికి కరపత్రం అందజేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

చిత్తూరు సెంట్రల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని శనివారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి నగర పరిధిలోని కాజూరులో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను స్థానికులకు అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు సూచించారు. నాయకులకు పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు.

17 నుంచి చాముండేశ్వరి జయంతి ఉత్సవాలు



అలంకరణలో చాముండేశ్వరిదేవి

పుంగనూరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 25 వరకు స్థానిక తూర్పు మొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17న వజ్రకవచ అలంకరణ, 18న పసుపు అలంకరణ, 19న పచ్చికొబ్బరి అలంకరణ, 20న నవధాన్య అలంకరణ, 21న విభూది అలంకరణ, 22న వెన్న అలంకరణ, 23న శాకాంబరీ అలంకరణ, 24న జీడిపప్పు, ద్రాక్ష అలంకరణ, 25న ధనలక్ష్మీ అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అలంకరణలో శనేశ్వరస్వామి



పుంగనూరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని దండుపాళ్యం, పుంగమ్మ చెరువు మొరవలో వెలసిన శనేశ్వరస్వామి శనివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఉపవాసాలతో స్వామి వారిని దర్శించుకున్నారు.

వేధింపులపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రుక్మానందనాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నల్లగుట్లపల్లె తాండాకు చెందిన మునస్వామి నాయక్ కుమార్తె స్వప్నకుమారి (22)తో కేవీపల్లె మండలం పెద్దతాండాకు చెందిన గోవిందునాయక్ కుమారుడు బాలాజీ నాయక్‌తో వివాహం జరిగింది. గత కొంతకాలంగా రూ.5 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు మామ గోవిందునాయక్, భర్త అక్కలు శ్రీదేవి, నూర్‌లు వేధిస్తున్నట్లు స్వప్నకుమారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మైసూర్ మహారాజుకు జ్ఞాపిక అందజేత



జ్ఞాపిక అందిస్తున్న తులసీనాథం నాయుడు

గంగవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మైసూర్ మహరాజు యదువీర్ కృష్ణ దత్త వడయారుకు గంగవరానికి చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాధం నాయుడు జ్ఞాపికను అందజేశారు. శనివారం మైసూర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన తులసీనాధం నాయుడు మైసూర్ మహరాజుతో కొద్దిసేపు ముచ్చటించి తెలుగు భాషాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం



మొక్క నాటుతున్న మంజుల

గంగవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని .. ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా పెంచాలని గంగవరం మండల జనసేన అధ్యక్షురాలు మంజుల అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయంతో గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన కోటి మొక్కల పెంపకం కార్యక్రమంలో భాగంగా ఆమె గంగవరం మండలంలోని గ్రామాల్లో పచ్చని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సమాజంలోని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకొని కనీసం ఒక్క మొక్క అయినా నాటి సంరక్షించాలని.. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన గాలి అందించడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

నేడు బైరెడ్డిపల్లెలో కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 13వ తేదీన ఆదివారం ఉదయం 9 గంటలకు చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే, మానస క్లినిక్, పున్నమి బేకరి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాటగంగమ్మ ఆలయంలో విశేష పూజలు



అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి విశేషాలంకరణ చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి



రామకుప్పం: బల్ల పంచాయతీ పెద్దకురబలపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మునస్వామి



రొంపిచెర్ల : కరపత్రాలు పంపిణీ చేస్తున్న చంద్రగిరి మనోజ్‌కుమార్

రొంపిచెర్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తోందని రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు చంద్రగిరి మనోజ్‌కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెంచమరెడ్డిగారిపల్లె, బుసిరెడ్డిగారిపల్లెలో గ్రామాల్లో టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. కూటమి ప్రభుత్వంలో సాధించిన అభివృద్ధి ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామమూర్తి, చంగల్‌రెడ్డి, రఘునాథ, మహినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే చంద్రబాబు ధ్యేయం

రామకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి ప్రతి కుటుంబం సంతోషంగా బతకాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి తెలిపారు. శనివారం రామకుప్పం మండలం బల్ల, బందార్లపల్లె, రామకుప్పం పంచాయతీల్లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. కార్యక్రమాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహులు, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, మహ్మద్‌రఫీ, గురప్ప, కృష్ణానాయక్, జయశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణప్ప, నాగభూషణం, నవీన్, వెంకటరమణ, కామరాజనాయక్, మనోహర్, రామలింగారెడ్డి, గజేంద్ర, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, ఆదిల్, అవినాశ్‌రెడ్డి, మంజునాథ్, నాగరాజు, శ్రీనివాసులు, మూర్తిచ అశ్వత్, సుబ్రహ్మణ్యం, శంకరప్ప, ఎర్రప్ప పాల్గొన్నారు.


ఆక్రమణ నుంచి శ్మశానానికి విముక్తి



శ్మశానానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇస్తున్న తహసీల్దారు

రామకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం 89పెద్దూరు గ్రామంలో దళితుల శ్మశాన స్థలానికి ఎట్టకేలకు ఆక్రమణ నుంచి విముక్తి కలిగింది. తమకు శ్మశాన స్థలం చూపాలంటూ శుక్రవారం స్థానిక దళితులు శవం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో దశాబ్దాల క్రితం దళితులకు శ్మశాన స్థలం ఉండేది. కాలక్రమంలో ఆ స్థలం ఆక్రమణకు గురికావడంతో ఎవరైనా చనిపోతే వారి పొలాల వద్దే శవాలను ఖననం చేస్తుండేవారు పొలం లేని వారు చనిపోతే శవాన్ని ఎక్కడ ఖననం చేయాలో బోధపడక తల్లడిల్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమ శ్మశాన స్థలాన్ని గుర్తించి ఆక్రమణలు తొలగించి స్థలం చూపాలని అధికారులకు వినతులిచ్చినా ఫలితం లేకపోయింది. తమకు శ్మశాన స్థలం చూపాలంటూ శుక్రవారం స్థానిక దళితులు శవం ముందు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడంతో తహసీల్దారు కౌలేష్ తమ సిబ్బందితో కలిసి శనివారం 89పెద్దూరుకు చేరుకున్నారు. 430/3 సర్వే నెంబరులోని 4 సెంట్ల శ్మశాన స్థలం నాగరాజు అనే వ్యక్తి ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. ఆక్రమణను తొలగించి ఆ స్థలాన్ని చదును చేసి దళితులకు అప్పగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో 4 సెంట్ల స్థలం శ్మశానానికి సరిపోదని స్థానికులు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లగా.. మరో చోట మరింత స్థలం కేటాయిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు లోకేష్, గ్రామపెద్దలు మణి, రాజబాబు, తులసీరాం, సురేష్, మురళీ, నరసింహులు, ఎమ్మార్పీఎస్ నేతలు రాఘవేంద్ర, వెంకటేష్, పళని తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో వాసవీమాత దర్శనం



బైరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాడ మాసంలో జరుగుతున్న విశేష పూజల్లో భాగంగా అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రామకృష్ణాచార్యులు అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వాసవీ ఫౌండేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేవరగుడి పల్లె-ఆడారెడ్డి పల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

- గోవిందనామ స్మరణతో మార్మోగిన టి.పుత్తూరు



తవణంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాములోరి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తుల గోవిందనామ స్మరణతో టి.పుత్తూరు పురవీధులు మార్మోగాయి. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి తోమాలసేవ, తిరుమంజనం, క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉంజల్‌సేవ నిర్వహించాక సుందరంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మేళతాళాలు, భజన బృందాల నడుమ పురవీధుల్లో రథోత్సవం సాగింది. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంలో రాణించాలి



అరుణశివప్రసాద్‌ను సన్మానిస్తున్న గణిత ఫోరం సభ్యులు

చిత్తూరు సెంట్రల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గణితంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాణించాలని ఏపీ గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్ పిలుపునిచ్చారు. ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శైలజాకుమారి ఆధ్వర్యంలో డైరెక్టర్ ప్రియతేజ అధ్యక్షతన ఉమ్మడి చిత్తూరు జిల్లా గణిత సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గణిత ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్‌పై శిక్షణ ఇచ్చారు. గణితం అవధానంలో భాగంగా 3600 దశాంశాలను తెలియజేసిన విద్యార్థులను ప్రశంసించారు. ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమనాయుడు, వేణుగోపాల్, మహిళా విభాగం అధ్యక్షురాలు జయంతి, కార్యదర్శి తులసి, శైలజమూర్తి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమిపూజ

● హాజరైన మంత్రులు, ఎంపీ, విప్



నెల్లేపల్లె మిట్ట వద్ద మంత్రులు, విప్, ఎంపీలకు పండ్ల మాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

గంగాధరనెల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన రూ.61లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి శనివారం ఉదయం భూమి పూజ చేశారు. ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్‌తోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హాజరయ్యారు. చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమనేనిచిట్టిబాబునాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు స్వామిదాస్, చెంగల్రాయయాదవ్, జయశంకర్‌నాయుడు, రుద్రయ్యనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మోహన్‌నాయుడు, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు జమీర్, మండల బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, నియోజకవర్గ కమ్మవారి వైభవం అధ్యక్షుడు దీపక్‌నాయుడు, నేతలు వజ్రా యువరాజారెడ్డి, పోలు రుషేంద్రరెడ్డి, కార్వేటినగరం, పాలసముద్రం మాజీ ఎంపీపీలు జనార్ధన్‌రాజు, ఇందిరమ్మ, పెనుమూరు మాజీ సర్పంచ్ కృష్ణమూర్తినాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు నీరజాక్షులురెడ్డి పాల్గొన్నారు.

చెరకు తోట దగ్ధం



దగ్ధమైన చెరకు తోట వద్ద స్థానికులు

గుడిపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బసవాపల్లె పంచాయతీ సీకేపల్లె హరిజనవాడ సమీపంలో శనివారం ప్రమాదవశాత్తూ జీజేఎం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెన్నకేశవులు నాయుడికి చెందిన చెరకు తోట కాలి బూడిదైంది. నాలుగు ఎకరాల్లోని చెరకు తోటకు, కొబ్బరి చెట్లకు మంటలు అంటుకోవడంతో దగ్గర్లో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి సమంజసం కాదు: కాంగ్రెస్

పూతలపట్టు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి సమంజసం కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పూతలపట్టు ప్రభాకర్ అన్నారు. దాడికి పాల్పడినవారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నేతలతో కలిసి పూతలపట్టు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. తనకీ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి మాణిక్య ఠాగూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకులు రామ్‌భూపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు వెంకటేష్, జిల్లా నాయకురాలు అంబికా గౌడ్, కుమారి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై దాడి: సీపీఐఎంఎల్

వెదురుకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై దాడిగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ దాడులను అరికట్టాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టంలాగా జర్నలిస్టులకు నిర్దిష్టమైన రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

సీఎం సహాయ నిధి అందజేత

ఐరాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కామినాయనపల్లె పంచాయతీ చిన్నవెంకటంపల్లెకు చెందిన భానుప్రకాష్‌రెడ్డికి శనివారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,12,790 చెక్కును ఎమ్మెల్యే మురళీ మోహన్ అందజేశారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ వడ్లపాటి గిరిధర్ బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, నాగేశ్వరరావు, గిరిధర్‌నాథ్, తులసీరామ్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : మంత్రి


కాజూరులో స్థానికుడికి కరపత్రం అందజేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు సెంట్రల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని శనివారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి నగర పరిధిలోని కాజూరులో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులకు కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. నాయకులకు పార్టీ శ్రేణులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. మేయర్ అముద, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, కాజూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



తవణంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాములోరి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల గోవిందనామ స్మరణతో టి.పుత్తూరు పురవీధులు మార్మోగాయి. ఉదయం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి తోమాలసేవ, తిరుమంజనం, క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉంజల్‌సేవ నిర్వహించాక సుందరంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మేళ తాళాలు, భజన బృందాల నడుమ పురవీధుల్లో రథోత్సవం సాగింది. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు, ఉభయదారులు పాల్గొన్నారు.

'టీడీపీ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి'


బాలాజీకి కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

నగరి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నగరి మున్సిపాలిటీ, మండల టీడీపీ నాయకులు అన్నారు. నగరిలోని ఐదో వార్డులో పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు గుణశేఖర్, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నగరి మండలంలోని వీకేఆర్‌పురం, ఎంఎస్ఎం.కండ్రిగ, వేలావడి గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి కార్యదర్శి వేణు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు జ్యోతినాయుడు, హరిబాబు, మణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ జన్మదిన వేడుకలను నగరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా వితరణ



గుడిపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నారగల్లు హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రానికి బీరువా లేదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు తెలిసింది. స్పందించిన ఆయన శనివారం ఓ బీరువాను టీడీపీ నాయకుల ద్వారా వితరణ చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అడవి కాదు.. కళాశాల ప్రాంగణం!

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు




కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు- గడ్డిమేస్తున్న పశువులు

గిరింపేటలోని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణం అడవిని తలపిస్తోంది. ప్రాంగణంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారడంతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు గొడుగుమూరు, సిద్ధార్థ నగర్, శివాజీ నగర్, ఓటిచెరువు, తదితర ప్రాంతాల నుంచి పశువులను తీసుకొచ్చి కళాశాల ప్రాంణంలోని పచ్చిక బైళ్లలో వాటి యజమానులు వదిలి వెళుతున్నా ప్రిన్సిపాల్, వాచ్‌మన్ పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రెండేళ్ల కిందట నాక్ కమిటీ వస్తుందని ఆగమేఘాలపై కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి, భవనానికి రంగులు వేశారు. ఆ తతంగం అవగానే పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగం కూడా ఏడాదిలో ఓసారి మురికివాడలకు వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు. వీరు కూడా కళాశాల ప్రాంగణాన్ని పట్టించుకోక పోవడం గమనార్హం. ఇకనైనా పిచ్చి మొక్కలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


బాధితుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ఐరాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కామినాయనపల్లె పంచాయతీ చిన్న వెంకటంపల్లెకు చెందిన భానుప్రకాష్‌రెడ్డికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,12,790 చెక్కును ఎమ్మెల్యే మురళీ మోహన్ అందజేశారు. చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ వడ్లపాటి గిరిధర్ బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, నాగేశ్వరరావు, గిరిధర్‌నాథ్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో రాణించాలి


అరుణశివప్రసాద్‌ను సన్మానిస్తున్న గణిత ఫోరం సభ్యులు

చిత్తూరు సెంట్రల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గణితంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాణించాలని ఏపీ గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణశివప్రసాద్ పిలుపు నిచ్చారు. ఏపీ గణిత ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శైలజాకుమారి ఆధ్వర్యంలో డైరెక్టర్ ప్రియతేజ అధ్యక్షతన ఉమ్మడి చిత్తూరు జిల్లా గణిత సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే గణిత ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్స్‌పై శిక్షణ ఇచ్చారు. గణితం అవధానంలో భాగంగా 3600 దశాంశాలను తెలియజేసిన విద్యార్థులను ప్రశంసించారు. ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమనాయుడు, వేణుగోపాల్, మహిళా విభాగం అధ్యక్షురాలు జయంతి, కార్యదర్శి తులసి, శైలజమూర్తి పాల్గొన్నారు.

11 సీట్లే ఇచ్చినా వైసీపీకి బుద్ధి రాలేదు: టీడీపీ

గుడిపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లే ఇచ్చినా బుద్ధి రాలేదని మాజీ జడ్పీటీసీ బాలాజీనాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ మండిపడ్డారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్.. సినిమా డైలాగులు చెబుతూ.. నరుకుతాం అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అదే తీరులో ఆ పార్టీ కార్యకర్తలు, మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడటాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఇలాగే కొనసాగితే వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి సమంజసం కాదు: కాంగ్రెస్


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్

పూతలపట్టు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి సమంజసం కాదని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పూతలపట్టు ప్రభాకర్ అన్నారు. దాడికి పాల్పడినవారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నేతలతో కలిసి పూతలపట్టు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కష్టపడేవారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. తనకీ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి మాణిక్య ఠాగూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకులు రామ్‌భూపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు వెంకటేష్, జిల్లా నాయకురాలు అంబికా గౌడ్, కుమారి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై దాడి: సీపీఐఎంఎల్

వెదురుకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడిని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై దాడిగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ దాడులను అరికట్టాలంటే ఎస్సీ, ఎస్టీ చట్టంలాగా జర్నలిస్టులకు నిర్దిష్టమైన రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

సంక్షిప్తంగా..

చెరకు తోట దగ్ధం

గుడిపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బసవాపల్లె పంచాయతీ సీకేపల్లె హరిజనవాడ సమీపంలో శనివారం ప్రమాదవశాత్తూ జీజేఎం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెన్నకేశవులు నాయుడికి చెందిన చెరకు తోట కాలి బూడిదైంది. నాలుగు ఎకరాల్లోని చెరకుతోటకు, కొబ్బరి చెట్లకు మంటలు అంటుకోవడంతో దగ్గర్లో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలు గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

డీసీసీ జనరల్ సెక్రటరీగా సెల్వం


నియామక పత్రం అందుకుంటున్న సెల్వం

గుడిపాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డీసీసీ జనరల్ సెక్రటరీగా తుమ్మలవారిపల్లె హరిజనవాడకు చెందిన సెల్వంను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. రాష్ట్ర నాయకుడు రామ్‌భూపాల్, టౌన్ అధ్యక్షుడు విక్కిరాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపొద్దు: సీఐ


ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ కృష్ణమోహన్

పూతలపట్టు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలపొద్దని ఆటో డ్రైవర్లకు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ సూచించారు. పోలీసుస్టేషన్‌లో శనివారం ఆటోడ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని చెప్పారు. లేదంటే భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చెప్పారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



పూతలపట్టు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గొడుగుచింత దళితవాడలో శనివారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీసెల్ నేతలు ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు దాము, ప్రతాప్, యోగీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● స్వాగతం


జిల్లా పర్యటనకు శనివారం వచ్చిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్‌కు చిత్తూరులో స్వాగతం పలుకుతున్న చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర

అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమిపూజ
హాజరైన మంత్రులు, ఎంపీ, విప్


భూమి పూజలో పాల్గొన్న మంత్రులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, రవికుమార్, ఎంపీ ప్రసాదరావు, విప్ థామస్ తదితరులు

గంగాధరనెల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన రూ.61లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి శనివారం ఉదయం భూమి పూజ చేశారు. ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్‌తోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హాజరయ్యారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, చిత్తూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమనేని చిట్టిబాబు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు స్వామిదాస్, చెంగల్రాయ యాదవ్, జయశంకర్‌నాయుడు, రుద్రయ్యనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మోహన్‌నాయుడు, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు జమీర్, మండల బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, నియోజకవర్గ కమ్మవారి వైభవం అధ్యక్షుడు దీపక్‌నాయుడు, నేతలు వజ్రా యువరాజారెడ్డి, పోలు రుషేంద్రరెడ్డి, కార్వేటినగరం, పాలసముద్రం మాజీ ఎంపీపీలు జనార్ధన్ రాజు, ఇందిరమ్మ, పెనుమూరు మాజీ సర్పంచ్ కృష్ణమూర్తినాయుడు, గ్రామకమిటీ అధ్యక్షులు నీరజాక్షులురెడ్డి, సతీష్‌కుమార్, మహేష్, ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

నెల్లేపల్లె పంచాయతీలో సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవాలతోపాటు 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన మంత్రులు, విప్, ఎంపీలకు క్రేన్ల సాయంతో మూడు రకాల గజమాలలు వేసి.. టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నెల్లేపల్లె మాజీ సర్పంచ్ పుష్పరాజ్, నెల్లేపల్లె మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, జిల్లా టీఎన్‌టీయుసీ మాజీ ఉపాధ్యక్షుడు దేవరాజులునాయుడు, నేతలు తుకారామ్‌రెడ్డి, వెంకటపతిరెడ్డి, బండ రమేష్, జయరామిరెడ్డి, వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్‌కార్యదర్శి శాంతకుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్, డీఈ శేషాద్రిరెడ్డి, పీఆర్ డీఈ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నెల్లేపల్లె మిట్ట వద్ద పండ్లమాలతో టీడీపీ శ్రేణుల స్వాగతం

మామిడి కొమ్మల నరికివేతపై చర్యలు తీసుకోండి

వెదురుకుప్పం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సమాచారం ఇవ్వకుండా తమ పొలాల్లోని మామిడి చెట్ల కొమ్మలను నరికేసిన కార్వేటినగరం మండలం డీఎంపురం విద్యుత్ లైన్‌మ్యాన్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు శనివారం కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎంపురం గ్రామ పంచాయతీ పాత దేరాకండ్రిగ గ్రామానికి చెందిన కేశవులు, సుబ్రహ్మణ్యంకు చెందిన పొలాల్లోని మామిడి చెట్ల కొమ్మలను, చెట్లను తమ అనుమతి లేకుండా, సమాచారం ఇవ్వకుండా డీఎంపురంలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మ్యాన్ నరికి వేశారని ఆరోపించారు. అసలే మామిడికాయలకు గిట్టుబాటు ధరలేకుండా ఇబ్బంది పడుతుంటే ఇలా చేయడమేంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై తగిన చర్యలు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.